సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 19 । మే । 2023



సదరం శిబిరం

సిరిసిల్ల: జిల్లా ఆస్పత్రిలో గురువారం 27 మంది దివ్యాంగులకు వైకల్య పరీక్షలు నిర్వహించారు. ఆర్థోపెడిక్ అనిల్‌కుమార్ పరీక్షలు చేశారు.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని 38 కోడెలు, 2 ఆవులను పోచంపెల్లికి చెందిన మహేశ్వరీ గోశాల, పెద్దబనగారం శివపత్రి గోశాలకు అందించారు.

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శానిటేషన్ పనులు పరిశీలన



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాళ్లపేటలో శానిటేషన్ పనులను గురువారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నిర్మాణంలో వేగం పెంచి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీవో పి.లచ్చాలు, జూనియర్ కార్యదర్శి జరీనా, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

'కంటి వెలుగు'తో అంధత్వ రహిత రాష్ట్రం



సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో అంధత్వ రహిత రాష్ట్రంగా మారుతుందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలోని 11వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరు వివిధ కంటి జబ్బులకు ఉచిత చికిత్స పొందాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ ఒగ్గు ఉమ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో సీట్ల భర్తీకి పరీక్ష

సిరిసిల్లఎడ్యుకేషన్: కేంద్రీయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ప్రవేశాలకు జూలై 22న పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ రమేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష రాసే వాళ్లు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ, దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లోని ఖాళీ సీట్లలో భర్తీ చేసే అవకాశం ఉందని తెలిపారు.

22 నుంచి జిల్లా స్థాయి సీఎం కప్

సిరిసిల్లఅర్బన్: రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి చీఫ్ మినిస్టర్ కప్–2023 పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి ఉపేందర్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. వయస్సు 15 నుంచి 36 ఏళ్లలోపు ఉండి, మండలస్థాయిలో విజేతలైన, ఆసక్తి గల క్రీడాకారులు 19 లోపు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల స్థాయి పోటీలతో పాటు అదనంగా ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చిన్నారులతో గడపండి



వేములవాడఅర్బన్: చిన్నారులతో వీలైనంత వరకు ఎక్కువ సమయం గడపాలని బాలసాహితీవేత్త డాక్టర్ వాసరవేణి పరుశురామ్ కోరారు. వేములవాడలోని వీరగోని పౌర గ్రంథాలయంలో బాలల వ్యక్తిత్వ నిర్మాణంపై గురువారం నిర్వహించిన ఉచిత శిబిరంలో హాజరై మాట్లాడారు. బాల్య దశ నుంచే మంచి అలవాట్లను నేర్చుకునేలా సూచించాలన్నారు. ఇలాంటి శిబిరాలు నిర్వహించిన గ్రంథాలయ నిర్వాహకులు వీరగోని ఆంజనేయులుగౌడ్‌ను అభినందించారు. చైతన్య గౌడ్, మహేశ్, ఉపాధ్యాయులు విశ్వతి లక్ష్మీనారాయణ, సుంకపాక దామోదర్ ఉన్నారు.

కంటి వెలుగులో 4,121 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో గురువారం కంటివెలుగు–2లో 4,121 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 578 మందికి రీడింగ్ అద్దాలను, 599 మందికి పాయింట్ అద్దాలు అందించారు. జిల్లా వ్యాప్తంగా 26 ప్రాంతాల్లో 234 మంది వైద్య సిబ్బంది శిబిరాల్లో పాల్గొన్నారు. ఇప్పటి వరకు 2,94,728 మందికి కంటి పరీక్షలు చేసినట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు.



- బోయినపల్లి మండలం నీలోజిపల్లి పునరావాస కాలనీకి చెందిన అనుముల మహేందర్ రైతు. ఏప్రిల్ 9న ఇంటికి తాళం వేసి రోజులాగే పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి కనిపించింది. అందులోని నాలుగు తులాల బంగారం, వెండి పట్టగొలుసులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బోయినపల్లి పోలీసులు కేసు నమోదు చేసి.. బీరువా ఇతర వస్తువులపై ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. దొంగల కోసం అన్వేషిస్తున్నారు.'



- కోనరావుపేటకు చెందిన మామిడి లక్ష్మి మే 10న ఇంటికి తాళం వేసి మరో ఊరికి వెళ్లింది. ఆమె ఇంటి తాళాన్ని పగులగొట్టిన దొంగలు రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఉన్నా.. దొంగలు భయం లేకుండానే దొంగతానికి పాల్పడ్డారు.



- ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన బిచ్చల సత్తిరెడ్డి తన పాత ఇంటికి తాళం వేసి కొత్త ఇంట్లో ఉంటున్నాడు. పాత ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు రూ.4 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ నగదు సత్తిరెడ్డికి మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువలో భూమి కోల్పోగా వచ్చిన పరిహారం డబ్బులు. అలాగే మండల కేంద్రంలోని దేశెట్టి బుగ్గవ్వ ఇంటి తాళాన్ని పగులగొట్టి అరతులం బంగారాన్ని ఎత్తుకెళ్లారు.

ఇలా జిల్లాలో ఇటీవలి కాలంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఇంటికి తాళం వేసి ఉంటే చాలు..దొంగలు ఆ ఇంటిని టార్గెట్ చేసి గుల్ల చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- జిల్లాలో వరుస దొంగతనాలు
- రెండు నెలల్లోనే 18 కేసులు
- తాళాలు పగులగొట్టి దర్జాగా చోరీలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- సొత్తు రికవరీ కొంతే



దొంగల బీభత్సం(ఫైల్)

సిరిసిల్ల: జిల్లాలో ఇటీవలి కాలంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. గతంలో తాళం వేసిన ఆలయాలను టార్గెట్ చేసే దొంగలు.. ఈ మధ్యకాలంలో ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దోచుకెళ్తున్నారు. వేసవికాలం కావడం.. స్కూళ్లకు సెలవులు ఉండడంతో పిల్లలతో ఆలయాలు, పర్యాటక ప్రదేశాలకు వెళ్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఇంటికి తాళం వేసి వెళ్తే చాలు వచ్చేసరికి దొంగలు తాళం పగులగొట్టి దర్జాగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇలా రెండు నెలల కాలంలో జిల్లాలో 18 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. గతంలోనూ ఇంటికి తాళం వేసి ఆరు బయట పడుకునే సందర్భాల్లో రాత్రి పూట దొంగతనాలు జరిగేవి. ఇప్పుడు పట్టపగలే జరుగుతున్నాయి.

రికవరీ అంతంతే...

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాస్తవానికి పోలీసులు ఇతర పనుల ఒత్తిళ్లతో బిజీగా ఉంటున్నారు. ఈ క్రమంలో దొంగతనం కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దొంగతనం జరిగిన ఇంటి పరిసరాల్లో ఉండే సీసీ కెమెరాలను పరిశీలించడం, క్లూస్ టీంతో విశ్లేషించడం, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచి కేసులను శోధించాల్సి ఉండగా.. ఆ దిశగా పోలీసుల విచారణ సాగడం లేదు. దొంగతనం కేసుల్లో రికవరీ కూడా అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన దొంగతనం కేసుల్లో బాధితులకు సొత్తు దక్కడం లేదు. దొంగలు కూడా పోలీసులకు చిక్కడం లేదు.

అప్రమత్తతే ముఖ్యం...

దొంగలబారి నుంచి తప్పించుకోడానికి ఎవరికి వారు అప్రమత్తంగా ఉండడమే చాలా ముఖ్యం. ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం.. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తే ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా వెంట తీసుకెళ్లాలి. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో పెట్టాలి. ఎక్కువ రోజులు ఊరికి వెళ్తే.. పక్కింటి వారిని అప్రమత్తం చేయడం, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వడం, తెలిసిన వారు ఇంట్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు పోలీస్ అధికారులు

దొంగలను గుర్తించే పనిలో ఉన్నాం



జిల్లాలో చోటుచేసుకుంటున్న దొంగతనాలపై విచారణ చేపడుతున్నాం. సీసీ కెమెరాల దృశ్యాలు, ఇతర మార్గాల్లో దొంగలను గుర్తించే పనిలో ఉన్నాం. పాత నేరస్తుల కదలికలపైనా నిఘా ఉంచాం. వాటిని పరిశీలిస్తున్నాం. పోలీస్ సిబ్బందితో గస్తీ పెంచుతున్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిందే.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

గంజాయి రవాణాదారులపై పీడీయాక్టు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- బోయినపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ



బోయినపల్లి ఠాణాలో ఎస్పీ అఖిల్‌మహాజన్

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డులు, రిసెప్షన్, జీడీ ఎంట్రీ, ఠాణాకు వచ్చేవారు వేచి ఉండే స్థలం, సిబ్బంది క్వార్టర్లను పరిశీలించారు. పెట్రోలింగ్ పెంచాలని సిబ్బందికి సూచించారు. పాత నేరస్తులు, సస్పెక్టులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని ఆదేశించారు. డయల్ 100 సమస్యలపై స్పందించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం చేయొద్దని ఆదేశించారు. డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐ బన్సీలాల్, ఎస్సై మహేందర్ ఉన్నారు.

రాజన్నకు మాసశివరాత్రి శోభ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను గురువారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మాసశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న సన్నిధి భక్తుల రద్దీతో కిటకిటలాడింది. మాసశివరాత్రిని పురస్కరించుకుని స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

8న 'సెస్' మహాసభ

- చైర్మన్ చిక్కాల రామారావు

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సేవలు అందిస్తున్న సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) మహాసభను జూన్ 8న నిర్వహిస్తున్నట్లు చైర్మన్ చిక్కాల రామారావు గురువారం తెలిపారు. 'సెస్'కు కొత్త పాలకవర్గం ఎన్నికై ఐదు నెలలు పూర్తయినా గ్రామ ప్రాతినిధ్య సభ్యుల(విలేజీ ప్రతినిధుల) సమావేశం ఇంకా నిర్వహించలేదు. 'సెస్'లో ఎంతో కీలకమైన మహాసభ నిర్వహణపై జాప్యమవుతుందని పేర్కొంటూ 'సాక్షి'లో మే 16న 'సెస్' మహాసభ ఎన్నడో? శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు జూన్ 8న స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'సెస్' ప్రాతినిధ్య సభ్యులకు గుర్తింపుకార్డులు, ఎజెండా కాపీలను అందిస్తామని, గతంలో లాగే రూ.500 సిట్టింగ్ ఫీజు చెల్లిస్తామని రామారావు వెల్లడించారు. 'సాక్షి' కథనంతో 'సెస్' మహాసభ నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు 'సెస్' అధికారులు మహాసభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.



'సెస్' మహాసభ ఎన్నడో..!

16న ప్రచురితమైన కథనం

సిరిసిల్ల-హైదరాబాద్‌కు అదనపు బస్సులు నడపాలి



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు అదనపు బస్సులు నడపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. ఈమేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో డిపో మేనేజర్ మనోహర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వెళ్తున్న వారికి సమయానికి బస్సుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిరిసిల్ల నుంచి తక్కువ సంఖ్యలో బస్సులు ఉన్నందున వేములవాడ నుంచి వచ్చే బస్సుల్లో సీట్లు దొరకడం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు నేరుగా మరికొన్ని బస్సులు నడపాలని కోరారు. ఇల్లందుల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో గురువారం రాత్రి మహాలింగార్చన వైభవంగా జరిగింది. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం లింగాకారంలో దీపాలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు.

అడవిలో జలసంపద

- 'ఉపాధి'తో నీటి వనరుల పెంపు
- జిల్లాలో రూ.13.44 కోట్లతో పనులు
- కూలీలకు ఊతమిస్తున్న ఉపాధి
- భూగర్భజలాలు, నీటివనరుల పెంపు
- రైతులకు ప్రయోజనాలు



చెరువులో పూడిక తీస్తున్న కూలీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అడవిలో వృథానీటిని ఒడిసిపట్టుకునేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఓ వైపు కూలీలకు పనులు కల్పిస్తూనే.. మరోవైపు భూగర్భజలాల పెంపుపై దృష్టి సారించింది. గతంలో రైతుల భూముల అభివృద్ధికే పరిమితమైన ఉపాధిహామీ పథకాన్ని విస్తరించింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.13.44 కోట్లతో పనులు చేపట్టారు. ప్రధానంగా చెరువుల్లో పూడికతీత, పారంపాండ్స్, కందిత కందకాలు, ఫీడర్ చానల్, భవనాలపై పడ్డ వర్షపు నీటి సంరక్షణ, బోర్‌వెల్ రీచార్జ్ పనుల ద్వారా నీటి నిల్వలను పెంపొందిస్తున్నారు. ఫలితంగా అడవిలోని జంతువులకు తాగు నీరు పుష్కలంగా లభించనుంది.

వృథానీటిని అరికడుతూ..

వర్షాకాలంలో వరద నీటి వృథాను అరికడుతూ.. నీటి వనరులను ఉపాధిహామీ పనుల ద్వారా వృద్ధి చేస్తున్నారు. చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతూ నీటి సామర్థ్యం పెంచుతున్నారు. పారంపాండ్స్ నిర్మాణాలు వృథా నీటిని పొదుపు చేయడానికి ఉపయోగపడుతున్నాయి. గుట్టల ప్రాంతాల్లో జాలువారే నీటిని కందిత కందకాలతో నిల్వ చేస్తున్నారు. అంతేకాకుండా అటవీ ప్రాంతం, వాగులపై ఫీడర్ చానల్ నిర్మాణాలను చేస్తూ వాటి ద్వారా వ్యవసాయ పొలాలకు సాగునీటిని అందించే చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. సహజ వనరుల నిర్వహణపై దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ.13.44 కోట్లు ఖర్చు చేసి నీటిని పొదుపు చేయడం విశేషం. రానున్న కాలంలో ఈ పనులను మరింత విస్తరించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

కూలీలకు ఉపాధి

జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పనులను నమ్ముకొని ఎన్నో కుటుంబాలు బతుకుతున్నాయి. అందులో భాగంగా నూతనంగా శ్రీకారం చుట్టిన నీటి పొదుపు పనులు కూలీలకు వరంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా జాబ్‌కార్డులు ఉన్న 1,23,000 కూలీలు 19,03,000 పనిదినాలను వినియోగించుకుని ఉపాధి పొందుతున్నారు.

జిల్లాలో పనుల వివరాలు ఇలా..

కూలీలు	1,23,000
జాబ్‌కార్డులు	73,000
పని దినాలు	19,03,000

జిల్లాలో చేపట్టిన పనులు ఇలా..

వివరాలు	పనుల సంఖ్య	ఖర్చు చేసిన మొత్తం
చెరువుల పూడికతీత	150	1.96కోట్లు
పారంపాండ్స్	318	2.17కోట్లు
కందిత కందకాలు	340	9.23కోట్లు
ఫీడర్ చానల్	192	4.20లక్షలు
వర్షపు నీటి సంరక్షణ	08	18వేలు
బోర్‌వెల్ రీచార్జ్	33	2.08లక్షలు

చేతి నిండా పని దొరుకుతోంది



ప్రభుత్వం అడవిలో నీటి నిల్వల కోసం కొత్తగా చేపట్టిన ఉపాధి పనులతో చేతినిండా పని దొరుకుతోంది. బయట కరువు పరిస్థితులుండగా ఉపాధితో వంద రోజులు పని చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఎంతో మంది కూలీలు ఈ పనులతో సంతోషంగా ఉన్నారు. రైతులకు మేలు జరుగుతోంది.

– చెరుకు మహేందర్, ఉపాధికూలీ

నీటి నిల్వలపై దృష్టి



ప్రభుత్వం వృథానీటిని అరికట్టి నీటిని పొదుపు చేసే చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరంలో నీటి నిలువలపై దృష్టి సారించి పనులు చేపట్టాం. ముఖ్యంగా వర్షపు నీరు వృథాకాకుండా అడవిలో కందిత కందకాలు, ఫీడర్ చానళ్లను ఏర్పాటు చేస్తున్నాం. కూలీలకు చేతినిండా పని దొరుకుతుంది.

– కొమురయ్య, ఏపీఎం, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


నర్సారెడ్డికి చెక్కు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. మండలంలోని బండ లింగంపల్లిలో జంగా నర్సారెడ్డి అనే రైతుకు చెందిన గేదె విద్యుత్‌షాక్‌తో మరణించగా.. సెస్ నుంచి మంజూరైన రూ.40 వేల పరిహారం చెక్కును గురువారం అందజేశారు. ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ కొత్తపల్లి వాణి, ఎంపీటీసీ పద్మ, నాయకులు రామచంద్రారెడ్డి, గుల్లపల్లి నర్సింహారెడ్డి, దేవరాజు, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

వంతెన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ రేణుక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలని ఎంపీపీ పిల్లి రేణుక సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా సమీపంలో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.70లక్షలు మంజూరు చేయగా గురువారం పనులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ కాంట్రాక్టర్ నాణ్యతలోపం లేకుండా పనులు చేయాలని సూచించారు. సర్పంచ్ ప్రభునాయక్, కాంట్రాక్టర్ ఉన్నారు.

రుణమాఫీ చేయండి


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): రైతుల రుణమాఫీ పూర్తి చేయాలని కోరుతూ ముస్తాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. రాజీవ్‌చౌక్‌లో ఆందోళన చేపట్టి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏళ్లు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదన్నారు. రైతులకు రుణమాఫీని నూరుశాతం చేయాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు బుర్ర రాములు, శ్రీనివాస్, రాజిరెడ్డి, గజ్జల రాజు, రమేశ్, రాజు, దీటి నర్సింలు, వేముల సత్యం, తిరుపతి, అగుళ్ల రాజేశం, మహేశ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, బాలరాజు, నరేశ్, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ను ప్రోత్సహించాలి

వేములవాడ: జిల్లాలో అథ్లెటిక్స్‌ను ప్రోత్సహించి, మంచి టీమ్‌ను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని సెస్ చైర్మన్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు పేర్కొన్నారు. వేములవాడలో గురువారం జిల్లా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య సలహాదారులుగా డీఎస్పీ నాగేంద్రాచారిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, కోశాధికారి భూక్యా వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు సుంకటి అజయ్‌కుమార్, తడుకల సురేశ్, భరత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి సాయికృష్ణ, ఉపాధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్, పిల్లి రాంచంద్రం, ఈసీ మెంబర్లు నలవాల రవి, బాబు, బొజ్జ రాజు, మాదాసు లక్ష్మణ్, గడ్డం హరీశ్ పాల్గొన్నారు.

అమ్మలకు ఆ‘పరేషాన్’

- ప్రసూతిలో సిజేరియన్లకే మొగ్గు
- కారణాలేమైనా కడుపుకోతే
- ప్రభుత్వాస్పత్రుల్లో 63 శాతం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో 87 శాతం సిజేరియన్లు

సిరిసిల్లటౌన్: అమ్మలకు పెద్దాపరేషన్ తప్పడం లేదు. ఇటు ప్రభుత్వ.. అటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కడుపుకోతలు సర్వసాధారణమయ్యాయి. ప్రజల వివిధ రకాల నమ్మకాలు సైతం వీటికి తోడయ్యాయి. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయాలన్న ఉద్దేశంతోపాటు అత్యధికంగా సాధారణ డెలివరీలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల కాసుల కక్కుర్తికి జిల్లాలో ఇటీవల సిజేరియన్లు పెరిగాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వస్తున్న నిండు గర్భిణులకు సైతం ప్రైవేటు ఆస్పత్రులు ధనాపేక్షతోనే సేవలందిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. వివిధ రకాల కుంటిసాకులతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా సిజేరియన్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న వ్యాపార వైద్యంపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఏర్పడింది.

సర్కారు వైద్యం టాప్

ప్రసూతి వైద్యసేవల్లో జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాలు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. సిరిసిల్లలోని జిల్లా ఆసుపత్రి, వేములవాడలోని ఏరియా ఆస్పత్రుల్లో అమ్మలకు కార్పొరేట్‌కు మించిన వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో సిజేరియన్లకు ప్రాధాన్యతనివ్వగా.. ప్రభుత్వాదేశాలతో చాలా రోజులుగా నార్మల్ డెలివరీలు చేస్తున్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి సైతం సిరిసిల్లకు వచ్చి పురుడు పోసుకోవడం విశేషం. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రి పదేళ్లుగా గైనిక్, జనరల్, పిడియాట్రిక్స్ విభాగాల్లో అందుతున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో అధునాతన టెక్నాలజీ మిషనరీతో మూడు ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. రూ.1.75 కోట్లతో సీటీ స్కానింగ్ సేవలు అందుతున్నాయి.


జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి వార్డు

కాన్పులకు ముహూర్తం ఖరారు

పురిటి బాధలు తెలువకుండా కోరుకునే వారు, శుభ గడియల్లో బిడ్డ పుట్టాలని కోరుకునే వారు కాన్పులకు ముందస్తు ముహూర్తం ఖరారు చేస్తున్నారు. ఇలాంటి కోరికలు పెద్దాపరేషన్లకు దారితీస్తున్నాయి. మరికొందరైతే సాధారణ ప్రసవాల్లో ఏదైనా రిస్కు జరిగితే ఎలా అనే మీమాంసలో సిజేరియన్లకు వెళ్తున్నారు. సిజేరియన్‌ల ద్వారా భవిష్యత్‌లో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన లేకపోవడం మరో కారణం.

వివరాలు ఇలా..
2022 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకు

మొత్తం ప్రసవాలు	ప్రభుత్వ ఆస్పత్రి	ప్రైవేట్ ఆస్పత్రి
7,980	4,653	3,327
సిజేరియన్లు	2,942	2,895
నార్మల్	1,711	432

ఆపరేషన్ చేయించుకున్న



మాది రైతు కుటుంబం. మా ఆయన వెంకటేశం వ్యవసాయం చేస్తారు. ప్రతీ నెల కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకున్న. సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రిలో మంచిదని వచ్చినం. సాధారణ కోసం డాక్టర్ వెయిట్ చేయించిండ్రు. కడుపులో బేబీ కదలికలు లేకపోవడంతో ఆపరేషన్ చేసిండ్రు.
– కొనబోయిన స్వప్న, వెంకట్రావుపల్లి

రెండు కాన్పులు నార్మల్



మా ఆయన రవీందర్ గల్ఫ్‌లో పనిచేస్తుండు. మొదటి కాన్పులో నిహాన్ష్(2) పుట్టిండు. ఇప్పుడు రెండో కాన్పును కూడా ఇక్కడి వైద్యులు నార్మల్ చేసిండ్రు. మూడుషిఫ్టుల్లో సిబ్బంది మంచి సేవలందిస్తున్నారు. ప్రతీ నెల మా ఊర్లో చెకప్ చేయించుకున్న. ప్రసూతికి మాత్రం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి వచ్చిన.
– ఉప్పు సారిక, కామారెడ్డి

సాధారణ కాన్పులు చేయాలి



సాధారణ ప్రసవాలు చేయాలని ప్రైవేటు ఆస్పత్రులకు ఆదేశాలిచ్చాం. ప్రజలు చాలా మంది వివిధ నమ్మకాలతో వారే ఆపరేషన్లు కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో సిజేరియన్లు ప్రభుత్వాసుపత్రుల్లో 63 శాతం, ప్రైవేటు ఆస్పత్రుల్లో 87 శాతం జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలపై ప్రజల్లో చైతన్యం రావాలి.
– డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో

లారీల కొరతతో రైతుల అవస్థలు

- బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి పర్శరామ్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్కాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీల కొరతతో పెద్ద ఎత్తున ధాన్యం లోడింగ్ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ఎడపల్లి పర్శరామ్ పేర్కొన్నాడు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ధాన్యం లోడ్ చేసేందుకు లారీలు రాకపోవడంతో రైతులు ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారని తెలిపారు. మిల్లుల్లో తాలు, తప్ప, తరుగు పేరిట ధాన్యం కోత పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ దర్పెల్లి నరేశ్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. లారీల కొరత తీర్చడంతోపాటు రైతులను మిల్లర్లు తాలు, తరుగు పేరిట ఇబ్బందులు పెట్టకుండా చూడాలని పర్శరామ్ అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

‘పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయండి’

గంభీరావుపేట(సిరిసిల్ల): మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మజీద్‌ను బదిలీ చేయాలని స్థానిక సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు గురువారం ఎంపీడీవోను కోరారు. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న మజీద్‌పై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో బదిలీ చేయాలని పేర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం పంచాయతీకి వచ్చే ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, జూనియర్ అసిస్టెంట్ శిరీష పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బులను సొంతంగా వాడుకున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా పంచాయతీ బిల్‌కలెక్టర్ పవన్ అనే వ్యక్తి నుంచి డబ్బులు తీసుకున్న సందర్భంలో ఆయనను సస్పెండ్ కూడా చేయడం జరిగిందని తెలిపారు. సిబ్బందిని నియంత్రించడంలో విఫలమైన పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని విన్నవించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


గంజాయి విక్రేతల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సై


స్వాధీనం చేసుకున్న గంజాయి, సెల్‌ఫోన్లు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నాగారం శివారులో గంజాయి విక్రయిస్తూ.. సేవిస్తున్న యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. నాగారం శివారులో వడిచెర్ల జాన్‌ప్రతాప్‌రెడ్డి(నాంపెల్లి), జడల నాగరాజు(నాంపెల్లి) గంజాయిని విక్రయిస్తున్నారని, గుడిసె చరణ్ (మారుపాక), గడప సాగర్ (నాగారం), వడ్లూరి వెంకటేశ్(సుద్దాల), ఓ మైనర్ బాలుడు (వట్టిమల్ల) గంజాయిని సేవిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడి చేసినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి 125 గ్రాముల గంజాయి, 5 మొబైల్ ఫోన్లు, రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఐదుగురిలో జాన్‌ప్రతాప్‌రెడ్డి పరారీలో ఉండగా మిగతా నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. ఎస్సై రమాకాంత్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి


ఉన్నత గ్రేడ్ సాధించిన విద్యార్థులతో డీఈవో రమేశ్

- జిల్లా విద్యాధికారి రమేశ్

సిరిసిల్లటౌన్: పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇకపై ఉన్నత లక్ష్యంతో చదివి జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాధికారి రమేశ్ సూచించారు. సిరిసిల్లలోని సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం విద్యాసంస్థల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన సభ నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఈఏడాది ఎస్సెస్సీ ఫలితాల్లో రాజన్నసిరిసిల్ల జిల్లా రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించిందన్నారు. గతేడాది కంటే ఒక ర్యాంక్ మెరుగుపడిందన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం 10, 9.8. 8.7. 9.5 గ్రేడ్ సాధించిన 44 మంది విద్యార్థులకు అభినందన పత్రాలను అందించారు. పాఠశాల కరెస్పాండెంట్ నాగుల సత్యనారాయణగౌడ్, ప్రిన్సిపాల్స్ సుధాకర్, మార్టిన్, రామకృష్ణ ఉన్నారు.

ఆగస్టులోగా మురికిశుద్ధి ప్లాంటు

- పనులు నాణ్యతతో చేపట్టండి
- అక్రమ లే అవుట్‌లను తొలగించండి
- వేములవాడలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: సిరిసిల్ల శివారులో నిర్మాణంలో ఉన్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) పనులు ఆగస్టులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సిరిసిల్ల శాంతినగర్ వద్ద రూ.61.25 కోట్లతో నిర్మిస్తున్న 19 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మురికినీటి శుద్ధి ప్లాంటును గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతతో పనులు చేసి, ఆగస్టులోగా వినియోగంలోకి తేవాలని సూచించారు. సిరిసిల్లలో రంగుల అద్దకం ద్వారా వచ్చే ద్రవ వ్యర్థాలనూ శుద్ధి చేసేలా చూడాలన్నారు. ఆర్డీఓ శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ వరంగల్ ఎస్‌ఈ ఎన్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఈఈ సంపత్‌రావు, డీఈఈ తిరుపతి, సిరిసిల్ల తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏడీ వరుణ్, టెక్నికల్ ఆఫీసర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్‌లను తొలగించండి

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో అక్రమ లే అవుట్‌లను తొలగించాలని జిల్లా కలెక్టర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించారు. అనుమతి లేని అక్రమ లే అవుట్ వివరాలను సబ్ రిజిస్ట్రార్‌లకు పంపించి, క్రయవిక్రయాలపై నిషేధం విధించాలన్నారు. ఆ స్థలంలో అందరికీ తెలిసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. సిరిసిల్ల ఈదుల చెరువులో అక్రమ నిర్మాణాలను తొలగించాలని సూచించారు. జూన్ 2 వరకు రగుడు, శాంతినగర్, పెద్దూర్‌లలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేయాలని, తాగునీటి వసతి కల్పించి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు. జూన్ 2 నాటికి సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ‘మన ఊరు.. మన బడి’లో మొదటి విడతలో చేపట్టిన 172 పాఠశాలలో మౌలిక, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. బైపాస్ రోడ్ల వెంట అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీహాల్స్ నిర్మాణాలను పూర్తి చేయాలని, సిరిసిల్లలో సెస్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా విద్యుత్, టెలిఫోన్, నెట్, కేబుల్ వైర్లు బయటకు కనిపించకుండా అండర్‌గ్రౌండ్‌లో ఉండేలా పనులు చేయాలని సూచించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నివాసయోగ్యం కాని ఇళ్లకు నోటీసులు ఇచ్చి కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశించారు.


శాంతినగర్‌లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడలో వేగంగా పనులు చేయాలి

వేములవాడలో టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ) ద్వారా చేపట్టిన పనులు వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ కోరారు. బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. మూలవాగు లెఫ్ట్ బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులను జూన్ 2 కల్లా పూర్తి చేయాలన్నారు. మూలవాగు లెఫ్ట్‌బండ్ అభివృద్ధి పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఫుట్‌పాత్ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఆవుపేడతో నిర్మించే బయోగ్యాస్ ఎలక్ట్రిసిటీ ప్లాంట్ పనులను జూన్ రెండు కల్లా పూర్తి చేయాలన్నారు. వేములవాడలోనూ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణ పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు టి.శ్రీనివాసరావు, పవన్‌కుమార్, మున్సిపల్ కమీషనర్లు సమ్మయ్య, అన్వేష్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, ఆలయ ఈఈ రాజేశ్, సెస్ ఎండీ రామకృష్ణ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నిక్షయ్ పక్కాగా అమలు చేయండి



సిరిసిల్లటౌన్: క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించేందుకు ‘నిక్షయ్’ పథకాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేయాలని టీబీ ప్రోగ్రాం రాష్ట్ర బృందం ప్రతినిధి డాక్టర్ ఉష్మా ఆదేశించారు. జిల్లాలో నిక్షయ్ అమలు తీరుపై ఆమె గురువారం పీహెచ్‌సీలను పర్యవేక్షించారు. జిల్లా వైద్యాధికారి ఆఫీసులో అధికారులకు సూచనలు చేసిన ఆమె కోనరావుపేట పీహెచ్‌సీలో టీబీ సెంటర్‌ను తనిఖీ చేశారు. సమీప గ్రామంలోని టీబీ రోగిని కలిసి అధికారులు మందులు, ప్రభుత్వ సాయం అందిస్తున్నారా.. అంటూ వివరాలను తెలుసుకున్నారు. 2025 వరకు టీబీ రహితంగా చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. ప్రోగ్రాం రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ భానుకిరణ్, డాక్టర్ కిరణ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలయ్య పాల్గొన్నారు.

మిల్లింగ్ బియ్యం ఎఫ్‌సీఐకి తరలించండి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిర్దేశిత లక్ష్యం మేరకు మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, రాచర్ల గుండారంలోని రైస్‌మిల్లులను గురువారం పరిశీలించారు. మిల్లుల్లోని ధాన్యంతోపాటు మిల్లింగ్ చేసిన బియ్యాన్ని, రికార్డులను తనిఖీ చేశారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవాలని సూచించారు. రైస్‌మిల్లర్లు ట్రక్‌షీట్‌ను తొందరగా పంపించాలని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్‌కుమార్ ఉన్నారు.


గుండారంలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి సీబీఎం రైస్‌మిల్లును గురువారం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ తనిఖీ చేశారు.

లారీల కొరత లేకుండా చూడాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం తరలించేందుకు లారీల కొరత లేకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం బద్దెనపల్లి, మండెపల్లి, రాళ్లపేట, కస్బేకట్కూర్ గ్రామాల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సీపీఐ మండల కార్యదర్శి మంచికట్ల రమేశ్, నాయకులు సోమ నాగరాజు, చంద్రం, మల్లయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. కనగర్తి మూలవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్ లింగంపెల్లి నరేశ్, యజమాని అలిపిరి ఆదిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కొలనూర్ శివారులో మరో ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్ సూర నవీన్, యజమాని బీనవేని మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మిల్లర్ల మాయాజాలం

- తరుగు వచ్చిందని.. డబ్బులు తిరిగివ్వాలంటూ హుకూం
- ఐకేపీ కేంద్రంలో రైతుల ఆందోళన

ముస్తాబాద్(సిరిసిల్ల): ధాన్యం విక్రయించిన.. డబ్బులు ఖాతాలో జమైన తర్వాత వడ్లు తక్కువ వచ్చాయని మిల్లర్లు పైసలు వాపసు ఇవ్వమంటున్నారని రైతులు వాపోయారు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది ఐకేపీ ధాన్యం కొనుగోలు వద్ద గురువారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు బైతి మల్లేశ్ మాట్లాడుతూ ఈనెల 7న 219 బస్తాలు అమ్మానని.. రూ.1.80 లక్షలు బ్యాంక్‌లో జమయ్యాయని వివరించాడు. మిల్లు యజమాని ఫోన్ చేసి 1.20 క్వింటాళ్ల వడ్లు తక్కువ వచ్చాయని.. డబ్బులు వాపస్ ఇవ్వాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకేపీలో కాంటా పెట్టినప్పుడు, మిల్లు వద్ద కాంటా పెట్టినప్పుడు తక్కువ వచ్చాయని ఎందుకు చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు.


తెర్లుమద్ది ఐకేపీ కేంద్రంలో రైతుల ఆందోళన

తనతోపాటు మరికొంత మంది రైతులు ఉల్లిబాబు, భీరయ్య, రాములు, మల్లేశం, బాల ఎల్లం, కొమ్మెట బుగ్గరాజు, చిర్ర రమేశ్, మల్లారెడ్డి తదితర రైతులు కూడా తమ వడ్లు తక్కువ వచ్చాయని అధికారులు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకేపీ సిబ్బంది, మిల్లర్ల ఒక్కటై తమను ముంచుతున్నారన్నారు. ఈ విషయంపై డీఎస్‌వో, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశామని ఎంపీటీసీ బైతి దుర్గవ్వ తెలిపారు. దీనిపై మిల్లు యజమాని వేణు వివరణ కోరగా.. తాము మోసానికి పాల్పడలేదని, ఎలాంటి విచారణకైనా సిద్ధమని పేర్కొన్నాడు.

జిల్లా రైతుల ఆలోచన మారింది

- 1,274 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు
- ప్రభుత్వ చొరవతో ముందుకొచ్చిన రైతులు
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ


జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా ఇన్‌చార్జి రాంబాబు

సిరిసిల్ల: జిల్లాలో వరి, పత్తి పంటలు సాగుచేసే రైతులు ఇప్పుడు ఆయిల్‌పామ్ సాగు దిశగా అడుగులు వేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్ల క్యాంపు ఆఫీస్‌లో గురువారం ప్రీ యూనిక్ ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా ఇన్‌చార్జి రాంబాబు జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిశారు. అరుణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 1,274 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారన్నారు. మొక్కలకు రూ.26,450 చొప్పున ప్రతీ ఎకరానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. జిల్లా రైతుల ఆలోచనలో మార్పు వస్తుందన్నారు. మిగతా రైతులు కూడా ముందుకొచ్చి ఆయిల్‌పామ్ సాగుచేయాలని కోరారు. వేములవాడ ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

రుద్రంగి(వేములవాడ): మండలంలోని మానాల గ్రామానికి చెందిన పెద్దగుట్ట(బడాపహాడ్) దర్శనానికి వెళ్తూ ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వృద్ధురాలు సిరికొండ రామవ్వ(75) గురువారం మృతిచెందింది. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం చందూర్ శివారులో డీసీఎం వ్యాన్ బోల్తా పడి రామవ్వ గాయపడ్డ విషయం తెలిసిందే. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామవ్వ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


సిరికొండ రామవ్వ(ఫైల్)